# ముహూర్తం



మల్లాది వెంకటకృష్ణమూర్తి

ఆ రోజే ఆ సినిమా విడుదల.

ఆంధ్రప్రదేశ్‌లోని అనేక ప్రదేశాలలో, అనేక అభిమాన సంఘాలు గల నటుడు ఆ చిత్రంలో నటించాడు.

రంగుల్లో తీయబడ్డ చిత్రం అది.

భారీ తారాగణంతో అధిక ఖర్చులతో తీసారా సినిమాని.

ఓ పాట కాశ్మీర్‌లో, ఓ పాట ఊటీలో చిత్రీకరించారు కూడ. సినిమా విడుదలకి ముందే ఆ చిత్రంలోని పాటలు పాప్యులర్ అయాయి.

ఆ రోజే ఆ సినిమా విడుదల. అదే మొదటి ప్రదర్శన, ఉదయం ఎనిమిదీ ముప్పైరెండుకి ప్రొజెక్టర్ ఆన్‌చేస్తారు. ఆ చిత్ర నిర్మాతకి జ్యోతిష్యం మీద నమ్మకం కాబట్టి ఆ ముహూర్తం నిర్ణయించాడు.

నేలక్లాసు క్యూ బాగా పొడుగ్గా, రద్దీగా వుంది. కొంతమంది ఉదయం ఐదింటికి వచ్చి క్యూలో నిలబడితే కొందరు రాత్రి ఆ బుకింగ్ విండోముందే పడకవేసారు.

బుకింగ్ విండో తెరిచే సమయం ఆసన్నమయ్యేకొద్దీ తొక్కిసలాట అధికం కాసాగింది. పోలీసులున్నారు. కాని లాభంలేకపోతోంది. చాకచక్యంగా, నించున్న మనుషుల తలల మీదనుంచి




నడిచివెళ్ళాడో సినిమా అభిమాని. బుకింగ్ విండోముందు గుంపులో ఓ చోట వాళ్ళ మధ్య కూరుకుపోయాడు, హఠాత్తుగా।

క్రమంగా త్రొక్కిసలాట ఎక్కువ అవసాగింది. క్యూ చెదిరింది. ఒకళ్ళ చొక్కాలు మరొకరు చింపుకుంటున్నారు. బూతులు తిట్టుకుంటున్నారు. బుకింగ్ విండోదగ్గరకి వెళ్ళడానికి విశ్వప్రయత్నం చేస్తూ తమ బలం ఉపయోగిస్తున్నారు. కొందరు అరుస్తున్నారు. కొందరు ఆ గుంపులో వూపిరాడక బయటపడాలని ప్రయత్నంచేస్తున్నారు. పోలీసులు లాఠీలతో బాదుతున్నారు బుకింగ్ విండో ముందు పెరిగిన గుంపును చెదరగొట్టడానికి.

పావుగంట తర్వాత పోలీస్ కాన్‌స్టేబుల్ ఆ త్రొక్కిసలాటలో నలిగి, వూపిరిఅందక, నేలకొరిగి, జనం చేత తొక్కబడి అక్కడికక్కడే మరణించిన ఓ వ్యక్తిని చూసాడు.

తర్వాత తతంగం జరగాల్సిన రొటీన్‌లో సాగిపోయింది. సినిమా మాత్రం ఎనిమిదీ ముప్పై రెండుకి మొదలయింది. థియేటర్లో, నిర్మాత కోరిన ప్రకారం.

ఆ మరణం గురించి స్థానిక దిన పత్రికలన్నిటిలో ఈవినింగ్ ఎడిషన్‌లో వార్త వచ్చింది.

మర్నాడు ఉదయం పేపర్లో ఇంకో వార్తకూడ తెలిసింది.

"మరణించిన వ్యక్తి నేలతరగతి ప్రేక్షకులు తన చిత్రాన్ని ఎలా రిసీవ్ చేసుకుంటారో, వాళ్ళతో టిక్కెట్ కొనుక్కుని, వాళ్ళ మధ్య కూర్చొని, స్వయంగా తెలుసుకోవాలని మద్రాసు నుంచి విజయవాడ వెళ్ళిన ఆ చిత్ర నిర్మాతే అని రూఢిగా తెలిసింది."

———